క్లుప్తంగా

బీసీలను మోసం చేసిన రాజకీయ పార్టీలు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ పార్లమెంట్ టికెట్ కేటాయింపులో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేశాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంటు టికెట్లను బీసీలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డిలకు ఈ ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకు కేటాయించి బీసీలను తీవ్రంగా మోసం చేశాయని ఆరోపించారు. ప్రతి ఎన్నికల్లో ఆ రాజకీయ పార్టీలు సీట్ల వద్దకు వచ్చే సరికి సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం జెండాలు మోసే కార్యకర్తగా, ఓటరుగానే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు సీట్ల కేటాయింపులో మోసం చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీసీలను కోరారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భరత్

వేములపల్లి : బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన పెదమాం భరత్ ఆదివారం నియమితులయ్యారు. ఈమేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ నియామకపత్రం భరత్‌కు అందించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని, తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్ : భారతీయ జనతా పార్టీ అనుబంధ యువ మోర్చా(బీజేవైఎం) జిల్లా ఉపాధ్యక్షులుగా నేరళ్ల అజయ్‌కి కీలక పదవులను దక్కాయి. ఈనెల 23న నల్లగొండలో నిర్వహించిన బీజేవైఎం సమావేశంలో ఎన్నుకున్నారు. ఆయనకు నియామకపత్రం అందజేశారు. తమ నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన జిల్లా, రాష్ట్ర, నియోజకవర్గ నేతలకు ప్రత్యేకంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

కనులపండువగా ఆలయ బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ రూరల్: అన్నెపర్తి బెటాలియన్ వద్ద భూ నీలాసమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం కనులపండువగా జరిగాయి. సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజ, హోమం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస రావు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల మంజూరు హర్షణీయం

హుజూర్‌నగర్ : నియోజకవర్గానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మంజూరు చేయించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.కాటమయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుతో యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హుజూర్‌నగర్‌కు మహర్దశ మొదలైందని పేర్కొన్నారు.

నేడు రథోత్సవం

మఠంపల్లి/మద్దిగూడ: మండలంలోని శివన్నగూడలో శ్రీ నీలకంఠ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మమత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి: మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన దోనాల మమత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మమత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మండడి వెంకట్రాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, కీర్తి వెంకన్న, మట్టి సాల్మన్, కప్పల సైదులు తదితరులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య లోపం

- కంపు కొడుతున్న మూత్రశాలలు
- వార్డుల్లోనూ అపరిశుభ్రత
- ఇబ్బంది పడుతున్న రోగులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం పడకేసింది. ఓపీ విభాగం సమీపంలో ఉన్న వాష్ రూం నుంచి వచ్చే దుర్వాసన ముక్కుమూసుకునేలా వస్తుంది. ఓపీ విభాగం రోగులు ఆ ప్రదేశానికి వచ్చి ముక్కుమూసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన వాష్‌రూం నుంచి దుర్వాసన రావడానికి ప్రధాన కారణం వాష్‌రూం లో పైపులు పగిలిపోయాయి. దీంతో మూత్రశాలల్లో రూంలోనే నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. కనీసం ఓపీ విభాగంలో చూసే వైద్యులు కూడా ఆ దుర్వాసనను పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగం తగ్గేందుకు ఆస్పత్రికి వస్తే.. ఈ దుర్వాసనతో ఉన్న రోగం పోవడం దేవుడెరుగు కొత్త రోగాలు వస్తాయోనని రోగులు పేర్కొంటున్నారు. రోగుల వార్డుల్లో సైతం పారిశుద్ధ్యం పడకేసింది. వార్డుల్లోని వాష్‌రూంలు కంపుకొడుతున్నాయి. ప్రతి రోజూ రోగుల వార్డును శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది.

సిబ్బంది ఉన్నా.. అపరిశుభ్రంగానే..

ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ఆస్పత్రిలో 19మంది కార్మికులను నియమించారు. కానీ పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించేందుకు కనీస చర్యలు చేపట్టకపోవడం రోగులను విస్మయానికి గురి చేస్తుంది. రోగుల వార్డులోనూ వాష్‌రూంలు కంపుకొడుతుండటం ఇన్ పేషెంట్ రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఆస్పత్రిని శుభ్రం చేసేందుకు నాసిరకం ఫినాయిల్ వాడుతూ ఒక్కొసారి ఫినాయిల్ లేకుండానే సదరు కాంట్రాక్టర్ ఆస్పత్రిని శుభ్రం చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆస్పత్రిలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించాల్సి ఉన్నా వైద్యాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దుర్వాసనకు తోడు ఆస్పత్రి ఆవరణలో బయో వేస్టేజీని ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పడేస్తున్నారు.

అవాక్కయిన ఎమ్మెల్యే..

ఏరియా ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో అపరిశుభ్రతను చూసి అవాక్కయ్యారు. ప్రతి ఉదయం ఆస్పత్రిని శుభ్రం చేయాల్సిన శానిటేషన్ సిబ్బంది ఎమ్మెల్యే వచ్చిన సమయంలోనే హడాహుడిగా వార్డులను శుభ్రం చేయడం చూసి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని శానిటేషన్ సిబ్బంది తీరుతో రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిపై అపనమ్మకం ఏర్పడేలా ఉందని వారితో అన్నట్లు సమాచారం. ఇప్పటికైన తీరు మార్చుకుని ఏరియా ఆస్పత్రిని, వార్డులను చూస్తే.. మనసుకు హత్తుకునేలా ఉండాలని అన్నారు.



అధ్వానంగా ఉన్న బాత్‌రూంలు



ఏరియా ఆస్పత్రి రోగుల వార్డుల్లో చెత్తాచెదారం



ఓపీ విభాగం సమీపంలోని మూత్రశాలలో ఊడిన పైపు

ఇబ్బంది లేకుండా చేస్తాం



ఆస్పత్రుల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా, రోగుల వార్డులు సైతం బాగుండేలా చర్యలు తీసుకుని రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. నూతనంగా ఏర్పాటు చేసిన వాష్‌రూంలో పైపులు ఊడిన విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే సదరు సిబ్బందితో మాట్లాడి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటాం. రోగుల వార్డుల్లోనూ పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తాం.

– శ్రీనివాస సమరథ్,
ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్.

జాతీయస్థాయిలో అనుముల కీర్తిని పెంచాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్

హాలియా : జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారులు తమ నైపుణ్యాలతో అనుముల మండల కీర్తి ప్రతిష్టలను పెంచాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్రీడాదినోత్సవం సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆకాంక్ష ప్లేవే స్కూల్‌లో జాతీయస్థాయి క్రీడాకారులైన ఎస్‌కె అయేషా, ఎండీ ఆపషా, ఆవుల కార్తీక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. కబడ్డీ క్రీడాకారులకు తన వంతుగా ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. క్రీడాకారులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి పేరు ప్రతిష్టలను తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు యడవెల్లి రాంబాబు, చనగల ఎల్లయ్య, పీఈటీ కాకునూరి రమేష్‌గౌడ్, అనుముల మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, మంగ్యానాయక్, కబడ్డీ కోచ్ ఎండీ అన్వర్, పీఈటీలు అనిల్, లింగస్వామి, సతీష్, రాము, నరేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ: స్థానిక పట్టణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కంభంపాటి రవి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఫొటోగ్రాఫర్లు నూతన టెక్నాలజీ నేర్చుకోవడానికి వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

మాడుగులపల్లి : ఆత్మీయత, మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీకగా నిలుస్తుందని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని చిరుమర్తి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. సర్వమత సారం ఒక్కటే అని అందరం సోదరభావంతో మెలగాలన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వినోద్, స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న అనిల్‌కుమార్

హాలియా : హాలియా మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పిల్లి చంద్రకళ ఆంజేయులును ఆదివారం ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సదర్భంగా ఆయన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపఅధ్యక్షుడు రమేష్, యువ నాయకులు కోటి, రాము యాదవ్, శివ యాదవ్, శేఖర్ గౌడ్, రాంబాబు యాదవ్, అంజి, సాయి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల అమీర్ ఆర్ట్స్ అకాడమి నెల్లూరువారు నిర్వహించిన ఆలిండియా చిల్డ్రన్ ఆర్ట్స్ కాంటెస్ట్‌లో విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ప్రతిభను కనబరిచిన వారిలో డ్రాయింగ్ క్లాస్‌కు చెందిన మూడో తరగతి చదువుతున్న ఎం. అద్వైత, పి. ఆధ్య, ఎనిమిదో తరగతి చదువుతున్న కె. రిత్విక్‌రెడ్డిలు వేసిన చిత్రాలకు బంగారు పతకాలతో పాటు సర్టిఫికెట్లు లభించాయని చిత్రకారుడు యినుగుర్తి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభను కనబర్చిన విద్యార్థులను స్థానిక ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

క్రీస్తు చూపిన మార్గంలో నడవాలి



దుబ్బతండాలో మట్టల ప్రార్థన నిర్వహిస్తున్న పాస్టర్ ధీరావత్ హన్యానాయక్



వేములపల్లిలో ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

వేములపల్లి : ప్రపంచ మానవాళి పాపపరిహారార్థం నిమిత్తం సిలువలో తన ప్రాణాలను అర్పించిన ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ స్పర్జన్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చిన్నారులు, పెద్దలు, సంఘ పెద్దలు కలిసి క్రీస్తు బోధనలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ స్పర్జన్‌కుమార్ మాట్లాడుతూ నాడు ఏసుక్రీస్తు జెరూసలేం వీధుల గుండా వెళ్తుంటే ఖర్జూర, ఈత మట్టలతో ఆయనకు స్వాగతం పలుకుతూ దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారని, ఆనాటి ఆనవాయితీ నిదర్శనంగా ప్రతి ఏటా మండల కేంద్రంలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టలాదివారం పేరుతో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టల జోసఫ్ డేనియల్, సాల్మన్‌రాజు, పుట్టల నతానియేల్, ఇమ్మానియేల్, డానియల్, జాన్, వజ్రమ్మ, విజయప్రేమ్‌కుమార్, సమాధాన్‌రాజ్, పుట్టల హేమలత, అబ్రహం, అశోక్, రాధిక, శైలజ, జ్యోతి, కవిత, లుథియానా, నిర్మల, పౌల్ పాల్గొన్నారు.

మట్టల ఆదివారం ప్రార్థనలు

మిర్యాలగూడ టౌన్ : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని ఉపవాస దీక్షలో భాగంగా ఆదివారం విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉపవాస దీక్షలను చేపట్టడం జరిగిందని, ప్రపంచం మాత్రం సుఖసంతోషాలతో పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాబాయి, శ్రీనివాస్, మధనాచారి, వెంకటేశ్వర్లు, వెంకన్న, కోటయ్య, బోజ్యా, వెంకటమ్మ, సుధారాణి, సుచరిత, జక్వేవా పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న న్యాయవాదులు, నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన సాముల రాంరెడ్డి, జక్కుల వీరయ్యను ఆదివారం పట్టణంలో కోదాడ, హుజూర్‌నగర్‌కు చెందిన పలువురు న్యాయవాదులు, నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కె.లక్ష్మీనారాయణరెడ్డి, అల్లం ప్రభాకర్‌రెడ్డి, ఈడుపుగంటి సుబ్బారావు, వంగవీటి రామారావు, చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, పులిచింతల వెంకటరెడ్డి, కుక్కడపు బాలకృష్ణ, పశ్య రవీందర్‌రెడ్డి, గుండా రాంరెడ్డి, చింతలపూడి కరుణాకర్, ప్రసాద్, విజయ్, దేవరం సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పాల్గుణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతః కాలంలో ఉభయ దేవేరులైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని మండపంలో అధిష్టింపజేసి కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా జరిపించారు. మొదట కనకదుర్గ ఆలయం నుంచి దేవాలయ వద్దకు మేళతాళాలు, హరినామ సంకీర్తనలతో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం సీతారామచంద్ర స్వామి, గోదాదేవి వేణుగోపాలస్వామిని ఒకే వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను అర్చకులు ఎస్.రాఘవాచార్యులు వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పల్లకీసేవలో ఆలయ అధికారి, అర్చకులు, భక్తులు

దాతకు సన్మానం..

శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి ప్రధాన ఆలయ గర్భాలయ ద్వారాలకు అర్చకులు ఎస్.రాఘవాచార్యులు– రాజ్యలక్ష్మి దంపతులు ఇత్తడి తొడుగులను తయారు చేయించి ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి పట్టువస్త్రాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలు ముందుకు తీసుకెళ్తా



నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్తా ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్తా బడుగు, బలహీనవర్గాలకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సన్మానించి మాట్లాడారు. అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామన్నారడ్కీ కార్యక్రమంలో దైద సత్యం, కత్తుల సూర్యనారాయణ, ఉబ్బెపల్లి కాశయ్య, ఆకారపు రాములు, కోట విజయ్, రేవూరి వీరప్రతాప్, కోడిరెక్క మట్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి ఎర్రబెల్లి గుట్ట ముస్తాబు



ఎర్రబెల్లిలో విద్యుత్ దీపాలతో గుట్ట అలంకరణ

నిడమనూరు : జాతర సందర్భంగా ఎర్రబెల్లి లింగమంతుల స్వామి గుట్టను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం రాత్రి 2గంటల తర్వాత మానిక్యాలదేవి–లిగమంతుల స్వామిల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. కల్యాణోత్సవానికి ముందుగా మానిక్యాలదేవికి తల్లిగంపతో వేడుక నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునస్వామి వారి కల్యాణోత్సవం అనంతరం ఉదయం 8గంటలకు నైవేద్యం(బోనాలు) సమర్పించనున్నారు. ఉమ్మడి నల్లగొండతో పాటు చుటుపక్కల జిల్లాలకు చెందిన యాదవులు, భక్తులు మూగజీవాలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. గుట్ట చుట్టూ వ్యారస్తులు గుడారాలు వేశారు. గుట్టకు, మెట్లకు, కల్యాణ మండపానికి విద్యుత్ దీపాలను అలంకించారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మాడుగులపల్లి : మండలంలోని బొమ్మకల్ ఆవాస గ్రామం గణపతివారిగూడెంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చరణలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఆవరణలో ధ్వంజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన గర్భగుడిలో ప్రతిష్ఠించారు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలి



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

దేవరకొండ : విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మకట్‌లాల్, ఆరిఫా అన్నారు. దేవరకొండ మండల పరిధిలోని వెంకట్‌తండా, చందంపేట మండలం పోలేపల్లిలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేకశిబిరం ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో చెట్లకు పాదులు తీసి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రోడ్లు శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● నందికొండలో కాముడి దహనం



నాగార్జునసాగర్ : హోలీ పండుగ సందర్భంగా నందికొండలో కాముడి దహనం చేస్తున్న ప్రజలు

టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.చందర్‌రావు

హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్ రావుడిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం వ్యాప్తంగా కొన్ని లక్షల మంది టెట్, డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారని అన్నారు. గతంలో టెట్ పరీక్షలకు సంబంధించి పేపర్–1కు ఫీజు రూ.200లు, పేపర్–2కు రూ.200 మాత్రమే ఉండేదని తెలిపారు. కానీ ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఆ ఫీజులను రెండు పేపర్‌లకు కలిపి రూ.1600లుగా పెంచడం టెట్ అభ్యర్థులకు చాలా ఇబ్బందికర విషయమని వాపోయారు. దీంతో రాష్ట్రంలోని అభ్యర్థులకు ఆర్థికంగా నష్టం జరిగే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం భారీగా పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించి అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు విలాస్, కోటేశ్వర్, శ్యామ్ పాల్గొన్నారు.

వృథాగా భగీరథ నీళ్లు



మిషన్ భగీరథ పైపులైన్ పగిలిన ప్రదేశం



భగీరథ నీటిని పంట పొలాలకు మళ్లించుకుంటున్న రైతులు

- పగిలిన పైపులైన్
- తాగునీటిని పంట పొలాలకు మళ్లించుకుంటున్న రైతులు

మిర్యాలగూడ : అసలే వేసవికాలంలో ప్రజలు తాగునీటికి అల్లాడుతుండగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు తాగునీరు అందడం లేదు. వేములపల్లి మండలం మొల్కపట్నం శివారులోని గోదాం వద్ద 6, 7 నెలల క్రితం, మొల్కపట్నం– మంగాపురం రోడ్డు వెంట నాలుగు నెలల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతుంది. ఇప్పటివరకు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో తమకు తాగునీరు అందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా తమకు తాగునీరు అందకపోవడంతో రోజూ రూ.20 పెట్టి క్యాన్ల ద్వారా నీటిని కొనుక్కోవాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పగిలిన మిషన్ భగీరథ నీటిని సమీపంలో ఉన్న ఓ రైతు నెల రోజుల నుంచి తన ఆరు ఎకరాల పంట పొలాలకు మళ్లించుకుని సాగు చేసుకుంటున్నారు. పగిలిన భగీరథ పైపులైన్ వద్ద ఒక కుంటలాగా ఆ నీటిని కాల్వల తీసి తాగునీటిని పంట పొలాలకు మళ్లించుకుంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడమేంటని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిన మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి వేసవిలో ప్రజలకు తాగునీటిని అందించి దాహార్తిని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.